
# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 11 -

## బాండు రంగమహాత్మ్యం

**బేతాళుడి శవాన్ని** మళ్ళీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు విక్రమార్కుడు. 'విక్రమార్కా! నీకు శ్రమకలుగకుండా ఉండేందుకు మళ్ళీ మరొక కథ చెబుతాను విను' అని బేతాళుడు ప్రారంభించాడు.

'భాగ్యనగరంలో బడుంగు దేవయ్య అనే నిర్మాత ఉన్నాడు. ఆయన తెలుగులో బాండ్ సినిమాలు తియ్యడానికి రైట్సు కొనుక్కున్నాడు. బాండ్ వేషం వెయ్యడానికి కొత్త నటుడిని పెట్టుకుంటే బెటరనుకున్నాడు. ఎందుకంటే అలవాటయిన నటులతో తిరకాసొచ్చింది. మగనటులంతా ఒళ్ళంతా కందిరీగలు కుడుతున్నట్టు, హీరోయిన్లంతా నిలబడి టాయ్‌లెట్‌కి వెళ్తున్నట్టు, డ్యాన్సులు లేకపోతే నటించలేమని నిక్కచ్చిగా చెప్పేశారు.

అంచేత పాండురంగ భాగవతార్ అనే హరికథలు చెప్పే శాస్త్రీని ఫిక్స్ చేసున్నాడు. వేషం ఫిక్సవగానే పాండురంగ భాగవతార్ బాండు బాబు అని బాండ్ నేమ్ ఖరారు చేసుకున్నాడు.

పాండురంగంగారు బాండు రంగం అయి, జేమ్సు పాండు, తర్వాత జేమ్స్ బాండు అయిపోయాడు.

తొలిచిత్రంలో అలవాటు కొద్దీ విలన్ దగ్గర హరికథ చెప్పసాగాడు. విలన్ పిల్లికి మర్దనా చేస్తూ ' అరికతలు సెప్పమాకు. అసలు పాయింటుకిరా' అని తన డబ్బింగ్ తనే చెప్పుకున్నాడు.

తర్వాత చిత్రంలో జోకులైడం మొదలెట్టాడు. 'నువ్వు జేమ్స్ బాండువయ్యా! ఆ జోకులేంటి నీ మొహం తగలడా!' అన్నాడు నిర్మాత బడుంగు దేవయ్య.

దానికి మన జేమ్సు పాండు, అదే జేమ్స్ బాండ్, 'అంతే సార్! సాన్‌కానరీ తర్వాత విడతలో రోజర్‌మూర్‌గారు జోకుల్తోటే కామెడీ చేశారు. ఇదేవిటయ్యా అనడిగితే - ఈ సినిమాకి ఇలాగే చెయ్యాలి సార్. లేకపోతే పేరుకి సీక్రెట్ ఏజంట్. ఎక్కడికెళ్ళినా - అయామ్ జేమ్స్‌బాండ్, సీక్రెట్ ఏజంట్ అని చెప్పుకుంటూ ఉంటాడు. అంతా అతన్ని 'హలో జేమ్స్‌బాండ్!' అని పిలుస్తూ ఉంటారు.

ఏవిటండీ నా బొంద సీక్రెట్! అందుకే వీడొక జోకు బాండ్ అందుకే అలా చేస్తున్నా' అన్నాడు. నేను కూడా శ్రీ రోజర్‌మూర్ గార్నే ఫాలో అవుతున్నా - అన్నాడు మన తెలుగు బాండ్ బడుంగు దేవయ్య నోరెత్తలేదు.

బడుంగు దేవయ్యకు బాండ్ సినిమాలే కాక, పిల్లల అనాధశరణాలయం ఒకటుంది. జేమ్స్ పాండు, అదే జేమ్స్ బాండు, బాండ్ గర్ల్స్‌తో నటిస్తూ పాత్రలో జీవించడంవల్ల, ప్రతి బాండ్ ఫిల్మ్‌కి పదిమంది చొప్పున పుట్టేశారు. అంచేత నిర్మాతగారు పిల్లల అనాధశరణాలయం పెట్టక తప్పలేదు. అక్కడికీ బాండు బాబుని వేడుకున్నాడు. 'ఇలా ప్రతి చిత్రానికీ పిల్లల్ని పుట్టించేస్తుంటే ఎలాగయ్యా?' అని. అందుకు మన హరికథ బాండ్, 'అయ్యా! మీరే చెప్పారు. బాండ్ పాత్ర శ్రీకృష్ణ పరమాత్మలాంటిదని - దుష్టశిక్షణ, శిష్టరక్షణ, గోపికావిలాసం అని.'

'గోపికా విలాసం అంటే ఇలాగటయ్యా? శ్రీకృష్ణుడు అస్ఖలిత బ్రహ్మచారి. అసలు అంతరార్థం అర్థం చేసుకోకుండా నా ప్రొడక్షన్ ఖర్చు పెంచేస్తున్నావ్' అని వ్యథ చెందాడు నిర్మాత. బాండు సినిమాలు తెలుగులో వరసగా హిట్స్ అయిపోతున్నాయి. బాండు వోడ్కా మార్టినీ షేకెన్ బట్ నాట్‌స్టర్‌డ్ అని ప్రతిచిత్రంలోనూ సేవిస్తున్నాడు. బాండ్ చిత్రాలు షేకవడంలేదు. ప్రేక్షకుల్లో స్టర్ సృష్టిస్తున్నాయి.

తెలుగువారు ఎక్కడ సక్సెస్ ఉంటే అక్కడి సక్సెస్ పుణికి పుచ్చేసుకుంటారు. కాపీ కొట్టే రైటు సొంతం చేసుకుని దానికి 'ఇన్స్పిరేషన్' అని పేరు తగిలించి కాపీరైటుని కాపీయే రైటుగా భావిస్తారు. ఒక బట్టలషాపు మొదలెడితే నెల తిరిగేసరికి పక్కన పది బట్టల షాపులు మొలుస్తాయి. ఒక స్వీట్ దుకాణం తెరిస్తే, ఆ ఏరియా అంతా స్వీట్ మార్కెట్ అయిపోతుంది. వంశవిస్తరణలా కళా విస్తరణ కూడా ఆరోగ్యదాయకమే. తానా, ఆటా, బాటా, సపోటా, దేవదాసు, దేవదాసు - 2, ఇలా ఏ కోణంలో చూసినా ఎన్నో కొత్త కెరటాలు.

తెలుగు జేమ్స్ బాండ్ విజయాలతో స్ఫూర్తి పొంది గుండు చెవలయ్య అనే నిర్మాత బ్రూక్‌బాండ్ హీరోగా అలాంటి చిత్రాలే నిర్మించి హిట్స్ ఇవ్వడం మొదలుపెట్టాడు.

జేమ్స్ బాండ్‌లా బ్రూక్ బాండ్ కూడా బాగా పాపులర్ అయ్యాడు. నిర్మాత బడుంగు దేవయ్య తన జేమ్స్ బాండ్ కథలకు ట్రీట్ మెంట్ మార్చాలనుకున్నాడు - బ్రూక్ బాండ్ చిత్రాలకు భిన్నంగా.

కొత్త తెలుగు జేమ్స్ బాండ్ చిత్రంలో క్లయిమాక్సులో జేమ్స్ బాండ్, శివుడి వేషం వేసుకొచ్చి, శివతాండవం చేసి త్రిశూలంతో విలన్ని హతమారుస్తాడు. శివుడి వేషధారణ అంతా రెడీ చేశాక శివుడి మెళ్ళో పాము మిస్సింగ్. బడుంగు దేవయ్య ప్రాపర్టీస్ అతన్ని పిలిచి అర్జంటుగా పాముని తీసుకురమ్మని కేకలేశాడు. జేమ్స్ బాండ్ - 'నాకు పాములంటే భయం - పాములేకుండా షాట్ తీసుకోండి' అన్నాడు.

'శివుడి మెళ్ళో పాములేకపోతే గుళ్ళో దేవుడి విగ్రహం లేనట్టుంటుంది. పేచ్చకులు ఒప్పుకోరు. నీకంత భయమైతే కరవని పాముని తెప్పిద్దాం' అని హీరోగార్ని వొప్పించాడు.

చివరికి ఒక పాముని తీసుకొచ్చారు. నిర్మాతకి చిరాకేసింది. - 'ఇదేంటయ్యా! పాముని తెమ్మంటే కొండచిలువని తెచ్చావ్!' అని గద్దించాడు.

'కరవని పాముని తెమ్మన్నారు కదు సార్. అంచేత కొండచిలువకి కాంప్రొమైజేషన్ కుదిరాను' అన్నాడు ప్రాపర్టీస్.

'సర్లే - షెడ్యూలు మార్చుకుంటే సచ్చేంత కరుసు. ఆ కెమేరావోణ్ణి ఏదో రకంగా కవర్ సెయమని సెప్పు' - అన్నాడు నిర్మాత.

జేమ్స్ బాండ్ మెడలో కొండచిలువని తగిలించారు. హీరోగారు భయం భయంగా మనసులో వణుకుతూ, పైకి గాంభీర్యం ప్రదర్శిస్తూ విలన్ ముందు శివతాండవం మొదలెట్టాడు. విలన్ చుట్టమీద చుట్టలు కాల్చేస్తూ, వికటంగా నవ్వుతూ కుర్చీని ఊపేస్తూ తనుకూడా ఊగిపోతున్నాడు.

సడన్‌గా బాండ్‌గారి తాండవం ఆగిపోయింది. మెడలో కొండచిలువ హీరో మెడచుట్టూ చుట్టుకుని ఊపిరాడకుండా ఉరితాడులా జేమ్స్ బాండ్ మెడ బిగించేసింది. హీరో కుప్పలా కూలిపోయాడు.

సెట్ అంతా ఖిన్నులైపోయారు. 'ఈశ్వరా! ఓ పరమేశ్వరా! నీకు అపచారం చేశాను - ఈ పాపిని క్షమించు.' అని నిర్మాత బడుంగుదేవయ్య బావురుమన్నాడు.

వెంటనే సెట్ అంతా ఖాళీ అయిపోయింది. తెలుగు జేమ్స్ బాండ్ పార్థివ దేహం మీద కొండచిలువ ఇంకా పాకుతోంది.

నటులు, టెక్నీషియన్లు, దర్శక నిర్మాతలు అంతా వెళ్ళిపోయారు.

ఆ క్లయిమాక్సు సెట్టు కాకులు దూరని కారడవిలో వేశారు. తెలుగు జేమ్స్ బాండ్ ఏకాకి శవం దగ్గరకు ఏ కాకి చేరలేదు. - ఇప్పుడు చెప్పు విక్రమార్కా! తెలుగుదేశాన్ని ఉర్రూతలూగించిన తెలుగు జేమ్స్ బాండ్‌కి నివాళి చెప్పకుండా, కర్మకాండల గురించి ఆలోచించకుండా నిర్మాత బడుంగు దేవయ్య అండ్ పార్టీ ఎందుకంత అర్జంటుగా అంతర్ధానమైపోయారు?

ఈ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ తల ఈశ్వరార్పణం అయిపోతుంది.' - అని ముగించాడు బేతాళుడు.

అప్పుడు విక్రమార్కుడు - 'ఓ బేతాళా! ఇందులో వింతేమీలేదు. తెలుగు చిత్రచరిత్రలో నిత్యం జరిగే కఠోర సత్యమిది. తెలుగు జేమ్స్ బాండ్ నిర్మాత, ఇంకా పలువురు తెలుగు నిర్మాతలు - బాండ్ హీరో పాండు భాగవతార్ ప్రాణాలు వదలగానే - వెంటనే మరో హీరో బ్రూక్ బాండ్ ఇంటికి తమ చిత్రాల కాల్‌షీట్స్ కోసం పరిగెత్తి క్యూలో నించున్నారు.

శ్రీ యస్వీ రంగారావుగారు స్వర్గస్థులయినప్పుడు, నిర్మాతలందరూ శ్రీ గుమ్మడిగారింటికి వెళ్ళి క్యూ కట్టిన విషయం నీకు విదితమేకదా!

కామాత్మా న స్స్వర్గ పరాః
జన్మ కర్మ ఫలప్రదామ్
క్రియా విశేష బహుళాం
భోగైశ్వర్య గతిం ప్రతి ||

కామ కర్మ నిష్ఠులకు వివిధ భౌతిక సుఖములందే మనస్సు తగుల్కొని యుండును. క్షుద్రమగు స్వర్గాది లోక సుఖములే సర్వస్వమనుకుందురు. శరీరానంతరము కూడా మోక్షమును కోరరు. - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు." -

- అని విక్రమార్కుడు తన సమాధానం ముగించగానే, రాజుకి మౌనభంగం కలిగి, బేతాళ బాండ్ ఎగిరి మళ్ళీ చెట్టెక్కేసాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments